కరుణామూర్తి

మూగజీవాల పట్ల కారుణ్యం... గ్రామ సింహాలపై దయాగుణం.. మనిషితో సమానంగా జీవించే హక్కు ఉన్న ప్రాణులను స్వేచ్ఛగా బతకనిద్దాం అనే నినాదం.. మానవత్వం, దయాగుణంతో వీధి కుక్కలను అక్కున చేర్చుకొని వాటికి ఆహారం అందించడంతో పాటు బాగోగులు చూసుకుంటున్నారు అగనంపూడికి చెందిన కాసా సరస్వతి. భర్తకు వస్తున్న పింఛన్‌లో కొంతమొత్తం మూగజీవాల సంరక్షణకు కేటాయించి అందరి మన్ననలు అందుకుంటున్నారు.

– అగనంపూడి



కాలు విరిగిన కుక్కను అక్కున చేర్చుకున్న సరస్వతి



కుక్కలకు ఆహారం పెడుతున్న సరస్వతి







ఆహారం తింటున్న గ్రామసింహాలు

- వీధి కుక్కల ఆత్మీయ నేస్తం
- సంరక్షణ బాధ్యత నుంచి అంతిమ యాత్ర వరకూ..
- సోషల్ మీడియా వేదికగా సరస్వతి ప్రచారం

అగనంపూడి అభిరామ్ గేటెడ్ కమ్యూనిటీలో నివాసముంటున్న **విశాఖ ఉక్కు కోఆపరేటివ్ స్టోర్స్ మాజీ డైరెక్టర్, విశ్రాంత** ఉద్యోగి కాసా పద్మరాజు సతీమణి సరస్వతి మూగజీవాల ప్రేమికురాలు. ఆరేళ్ల నుంచి వీధి కుక్కలు, పక్షుల సంరక్షణ బాధ్యతలు స్వీకరించి ఆత్మ సంతృప్తి చెందుతున్నారు.

భర్తకు వచ్చే పెన్షన్ డబ్బుల్లో సగం కంటే ఎక్కువ వెచ్చించి కుక్కలకు ఆహారం, బిస్కట్లు, వైద్య సదుపాయం అందిస్తున్నారు. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో గ్రామ సింహాలకు అన్నం, చికెన్ తయారు చేసి పొట్లాలు కట్టి అందిస్తున్నారు. సుమారు 20 కుక్కల వరకు నిత్యం ఆహారం అందిస్తున్నారు. ఆమె రోడ్డు మీద నడిచి వెళ్తుంటే వెంబడించి బిస్కట్లు కొనిపెట్టే వరకు వదలని వాత్సల్యాన్ని పెంచుకున్నారు. ఆమె కనపడగానే గ్రామసింహాలు చుట్టూ చేరి అల్లరి చేస్తాయి. గేటెడ్ కమ్యూనిటీలోకి కుక్కలను తీసుకువెళ్లడానికి అనుమతి లేకపోవడంతో సమీప ప్రాంతాల్లో వాటికి నిత్యం ఆహారం అందిస్తున్నారు.

వైద్యం కూడా..

వీధి కుక్కలకు ఆరోగ్యం క్షీణిస్తే వాటికి దగ్గరుంచి వైద్య చేయిస్తారు. నయం కాని పక్షంలో చనిపోతే బాధాతప్త హృదయంతో శాస్త్రీయ పద్ధతి ఖననం చేస్తూ విశ్వమాత మదర్ థెరిసాను గుర్తు చేస్తున్నారు. అలాగే ఇంటి బాల్కనీలో పక్షుల కోసం నీటిని అందుబాటులో ఉంచుతున్నారు. వాటికి ఆహారంగా గింజలను కూడా ఆమె సమకూర్చుతున్నారు.

సోషల్ మీడియా వేదికగా..

వీధి కుక్కల పట్ల చాలా మంది కాఠిన్యంగా వ్యవహరిస్తూ రాళ్లతో, కర్రలతో కొట్టి తరిమివేస్తారు. హింసిస్తున్నారు. మూగజీవాల పట్ల దయాగుణం లేకపోయినా ఫర్వాలేదు .. కాఠిన్యం ప్రదర్శించకుండా ఉంటే చాలని ఆమె సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేస్తున్నారు. ఎవరి నుంచి ఏమీ ఆశించకుండా సొంత నిధులతో ఆమె కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు.

జాలి చూపకపోయినా... హింసించవద్దు



మనిషి భూమిపై ఎలా స్వేచ్ఛగా బతుకుతున్నాడో, మూగజీవాలైన కుక్కలు, ఇతర జంతుజాలాలు కూడా బతికే హక్కు, స్వేచ్ఛ ఉంది. అలాంటప్పుడు అవి గ్రామాల్లో సంచరిస్తుంటే వాటిని రాళ్లు, కర్రలతో కొట్టి ఎందుకు హింసిస్తున్నారు. అలా చేయడం సరికాదు. వాటి జోలికి వెళ్లకపోతే ఏ జంతువు కూడా మనిషికి హాని చేయదు. జంతువుల పట్ల దయ, కరుణ లేకపోయినా పరవాలేదు. వాటిని హింసించకుండా ఉంటే చాలని ప్రతి ఒక్కరూ గ్రహించాలి. నా భర్త పద్మరాజు సహకారంతో నేను గ్రామ సింహాలను చేరదీసి ఆహారం అందిస్తున్నాను. కుక్కలకు ఆహారం అందించడం ద్వారా నేను పొందే అనుభూతి చెప్పలేనిది.. వర్ణనాతీతం. మూగజీవాల పట్ల చూపించే అభిమానం, దయాగుణం ఎప్పటికైనా మనకు మంచి చేస్తుందనే నమ్ముతున్నాను.

– కసా సరస్వతి, జంతుప్రేమికురాలు.

విశేష పుష్పాలతో తిరుమలేశునికి అలంకరణ



విశేష అలంకరణలో శ్రీదేవి భూదేవి సహిత తిరుమలేశుడు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో తిరుమలేశునికి నిత్యం విశేష పూజలు నిర్వహిస్తున్నారు. శనివారం అర్ధరాత్రి వరకు తిరుమలేశునికి విశేష పుష్పాలతో సహస్ర నామార్చన చేశారు. మధ్యాహ్నం సర్వదర్శనం అనంతరం అన్న ప్రసాద వితరణ గావించారు. శ్రీదేవి భూదేవి సహిత తిరుమలేశునికి విశేష పుష్పాలతో అలంకరణ చేపట్టారు. తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

మేయర్ పీలాకు గౌరీ సేవా పరిషత్ సత్కారం



మేయర్‌ను సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: మేయర్ పీలా శ్రీనివాసరావును స్టీల్ ప్లాంట్ గౌరీ సేవా పరిషత్ నాయకులు అభినందించారు. మేయర్‌గా పీలా శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆదివారం నాయకులు ఆయన్ను కలిసి శాలువా కప్పి మొక్క అందజేశారు. స్టీల్‌ప్లాంట్ సమస్యలను వివరించి నగర మేయర్‌గా సహకారం అందించాలని కోరారు. సంఘం అధ్యక్షుడు దొడ్డి సన్నిబాబు, ఆళ్ల నాగరాజు, పెంటకోట శ్రీనివాసరావు, కొయిలాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి విరాళం



రూ.50,116 అందిస్తున్న దాతలు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి శాంతినగర్ కాలనీలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శ్రీనివాసాచార్యులు, భాను సీతాలక్ష్మి దంపతులు రూ.50,116 ఆలయ కమిటీకి అందించారు. ఆలయంలో నిర్వహించే స్వామి వారి కైంకర్యముల సేవ నిమిత్తం ఆలయ ధర్మకర్త ఈకే చారికి ఆదివారం నగదు అందజేశారు. దాతలను స్వామివారి శేషమాల, కండువాతో సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు సాయిబునాయుడు, కృష్ణారావు, నరసింగరావు మాస్టార్, సోమశేఖర్, గురునాథ్, సత్యనారాయణ, ఉమామహేశ్వరరావు, మోహిని, నాగలక్ష్మి పాల్గొన్నారు.

మాతృమూర్తులకు చీరల పంపిణీ



వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న రామారావు

అగనంపూడి: అంతర్జాతీయ మాతృదినోత్సవం సందర్భంగా 79వ వార్డు అగనంపూడికి చెందిన మహాత్మాగాంధీ సేవా సంఘం అధ్యక్షుడు చిత్తా రామారావు వృద్ధ మహిళలకు చీరల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్మనిచ్చిన అమ్మా నాన్నలను ప్రతీ బిడ్డ గౌరవించాలన్నారు. వయోభారంతో బాధపడే వారిని చంటి పిల్లల్లా భావించి భారం అనుకోకుండా బాధ్యతగా చూసుకోవాలని కోరారు.

ఉత్సాహంగా ఖోఖో పోటీలు



ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

గాజువాక: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు ఖోఖో పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు తొలుత నీతి కథలను బోధించడంతో పాటు వాటి అర్థాలను గ్రంథాలయాధికారి బి.చంద్రకళ వివరించారు. అనంతరం మోనో నటనను సాధన చేయించారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచడానికి గ్రంథాలయంలో అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, చిన్నారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.


ఉచిత వైద్య శిబిరానికి స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కూర్మన్నపాలెం: స్థానిక తిరుమలనగర్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేషస్పందన లభించింది. చిల్డ్రన్స్‌పార్కులో ఏర్పాటు చేసిన శిబిరంలో వైద్యులు డాక్టర్ ప్రవీణ్,డాక్టర్ చందవ్యా, డాక్టర్ దివ్యాంకిత, డాక్టర్ గోపి వైద్యపరీక్షలు నిర్వహించారు. సుగర్,బీపీ,ఈసీజీ వంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. తిరుమలనగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రతినిధులు పరమానంద, విశ్వేరరావు,నాగభూషణ్, శేఖర్ రాజు, వసంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుంచుమాంబ పండగకు ఏర్పాట్లు



గాజువాక: గాజువాక గ్రామ దేవత కుంచుమాంబ పండగకు విస్తృత ఏర్పాట్లు చేశారు. మహోత్సవాల్లో భాగంగా ఈనెల 13న అనుపోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఆ రోజు తెల్లవారుజాము నుంచే అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఉత్సవానికి పలువురు ప్రముఖులతోపాటు గాజువాక పరిసర ప్రాంతాలైన నాతయ్యపాలెం, షీలానగర్, మల్కాపురం, శ్రీహరిపురం, కూర్మన్నపాలెం ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారు. పండగ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్లు శ్రీనివాసరావు, నర్సింహపాత్రుడు

పెదగంట్యాడ: స్థానిక బీసీ రోడ్డులోని పెట్రోల్ బంక్ ఎదురుగా వైఎస్సార్ సీపీ నాయకుడు, తనూజా ఎంటర్‌ప్రైజెస్ అధినేత నాగిశెట్టి శ్రీను ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్లు బొడ్డు నర్సింహపాత్రుడు, గంధం శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో ఇటువంటి చలివేంద్రాలు ఏర్పాటు చేసి బాటసారుల దాహార్తి తీర్చేందుకు కృషి చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ధర్మాల శ్రీనివాసరావు, మద్దాల అప్పారావు, పిట్టా ప్రకాశ్ రెడ్డి, రాంబాబు, దేవి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వాటర్ బాటిళ్ల పంపిణీ



ప్రయాణికులకు మంచినీరు పంపిణీ చేస్తున్న స్పందన చేయూత ఫౌండేషన్ ప్రతినిధులు

అగనంపూడి: స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మిట్ట మధ్యాహ్నం దువ్వాడ వచ్చే రైలు ప్రయాణికులకు మినరల్ వాటర్ బాటిళ్ల పంపిణీ కొనసాగుతోంది. ఆదివారం స్పందన చేయూత ఫౌండేషన్ ప్రతినిధులు వాటర్ పంపిణీ చేశారు. 11 రోజులుగా వివిధ స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నాయి. జనరల్ బోగీలు, మహిళలు, దివ్యాంగుల బోగీల్లోని ప్రయాణికులకు మినరల్ వాటర్ బాటిళ్లు అందిస్తున్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ ఈవూరి బుచ్చిరాజు, ప్రతినిధులు సీతారామరాజు, నాథ్, లత, సరోజిని, శ్రావణి, జ్యోతి, రమ, దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో మురళీ నాయక్‌కు నివాళి



మురళీనాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

ఉక్కునగరం: అమరుడైన జవాన్ మురళీ నాయక్‌కు స్టీల్‌ప్లాంట్‌లో ఆదివారం ఘన నివాళులర్పించారు. జమ్ముకశ్మీర్‌లో విధులు నిర్వహిస్తుండగా పాకిస్తాన్ జరిపిన కాల్పుల్లో సత్యసాయి జిల్లాకు చెందిన మురళీనాయక్ మృతి చెందిన విషయం విధితమే. స్టీల్‌ప్లాంట్ బంజారా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉక్కునగరంలో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.లక్ష్మీ నాయక్, ప్రధానకార్యదర్శి బూక్యా వెంకటేశ్వర్లు, ఎం. లక్ష్మణ్, బి. శివరామ నాయక్, బి.ఎం.కె. నాయక్, బి. రంగానాయక్, రాజు నాయక్, శ్రీను నాయక్‌తో పాటు బంజారా మహిళలు పాల్గొన్నారు.

వెలకట్టలేనిది అమ్మప్రేమ



చీరలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతలపూడి

కూర్మన్నపాలెం: వెలకట్టలేనిది అమ్మ ప్రేమ ఒక్కటేనని గాజువాక మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య పేర్కొన్నారు. మాతృదినోత్సవాన్ని పరస్కరించుకొని 87వ వార్డు అంబేడ్కర్ కాలనీలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమాని ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అమర జవాన్ల ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లల క్షేమాన్ని కోరే అమ్మకు లోకంలో ఎవరు సాటిరారని అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇల్లపు రాము సమకూర్చిన చీరలను మహిళలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రగడ వేణుబాబు,దామోదర్, దానప్పలు,బొండాగోవిందరాజులు, నాగేశ్వరరావు, పాపారావు, రామలక్ష్మి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర పరిస్థితి ఏర్పడితే పవర్ కట్

అక్కిరెడ్డిపాలెం: గాజువాక 220 కేవీ వి.ఎస్.ఎస్, 220 కేవీ గంగవరం వి.ఎస్.ఎస్‌లలో విద్యుత్ ట్రాన్స్ మిషన్ లైన్ల ఆధునికీకరణలో భాగంగా అత్యవసర పరిస్థితి ఏర్పడితే జిల్లాలోని 4 ఉపకేంద్రాల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ గాజువాక) బి.శ్రీనివాస్ ఆదివారం తెలిపారు.

ఈనెల 12 నుంచి జూన్ 26 వరకు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మరమ్మతులు చేసేందుకు ఏపీ ట్రాన్స్‌కో ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. దీని కారణంగా వి.ఎస్.ఎస్. 220 కేవీ ఉపకేంద్రంలో సర్క్యూట్ విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపివేస్తున్నామన్నారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడితే గాజువాక 220 కేవీ, మల్కాపురం 132 కేవీ, నేవల్ వార్ఫ్ 132 కేవీ, పోర్టు 132 కేవీ ఉపకేంద్రాల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగే అవకాశం ఉందన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల అడ్మిషన్ల వేట

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల ప్రచారం



దిబ్బపాలెంలో అడ్మిషన్ల ప్రచార కరపత్రాలు పంపిణీ చేస్తున్న నడుపూరు పాఠశాల ఉపాధ్యాయులు

పెదగంట్యాడ: రానున్న విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచడానికి మండల పరిధిలోని నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కసరత్తు చేస్తున్నారు. తమ పాఠశాలలో కల్పిస్తున్న సదుపాయాలు, గతేడాది, ఈ ఏడాది సాధించిన ఫలితాలు, విద్యాప్రగతి, ఉపాధ్యాయుల వివరాలతో రూపొందించిన కరపత్రాలతో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తూ తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు.

పదోతరగతి ఫలితాల ప్రాతిపదికగా.

నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల పదోతరగతి విద్యార్థులు సాధించిన మార్కులను చూపించి మీ పిల్లల్ని మా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలంటూ ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు బృందాలుగా మండలంలోని వివిధ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రీస్కూల్ పూర్తయిన పిల్లలను ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో చేర్పించాలని, కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలకు పంపి ఫీజుల రూపంలో లక్షల్లో డబ్బు వృథా చేయవద్దని కోరుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం, ఉచితంగా పాఠ్య పుస్తకాలు, బూట్లు, సాక్షులు, స్కూల్ బ్యాగ్స్ అందిస్తున్నారని వివరిస్తున్నారు.

తల్లిదండ్రులు సహకరించాలి



పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి వారి భవిష్యత్‌కు బాటలు వేయాలని తల్లిదండ్రులకు సూచిస్తున్నాం. విద్యా ప్రమాణాలు పాటిస్తూ ఉత్తమ ఫలితాలు సాధనే ధ్యేయంగా ఉపాధ్యాయులమంతా కృషి చేస్తున్నాం. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల కంటే మెరుగైన బోధన అందిస్తున్నాం. తల్లిదండ్రులు సహకరించాలి.

– రాచకొండ శ్రీనివాస్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నడుపూరు

క్రికెట్ విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందజేస్తున్న పల్లా చినతల్లి

గాజువాక: హెచ్‌ఎస్సార్ యూత్ ఆధ్వర్యంలో 67వ వార్డులో మూడు రోజులపాటు నిర్వహించిన బీవీఎస్‌ఎస్ మెమోరియల్ ఓపెన్ విండ్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు ఆదివారం డీసీఎంఎస్ మాజీ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి బహుమతులు, ట్రోఫీలను ప్రదానం చేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన కోన వారియర్స్ టీమ్‌కు రూ.10వేల నగదు బహుమతి, ట్రోఫీ అందజేశారు. ద్వితీయ స్థానం సాధించిన బ్లాక్ పాంథర్స్ జట్టుకు రూ.6వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు పల్లా పెంటారావు, హెచ్‌ఎస్సార్ యూత్ ప్రతినిధులు బాబి, వెంకటేష్, నిశాంత్, శ్యామ్, రాపేటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



సమ్మర్ క్రికెట్ క్యాంపును ప్రారంభిస్తున్న పల్లా

పెదగంట్యాడ: విద్యార్థుల్లో దాగిఉన్న క్రీడానైపుణ్యాన్ని వెలికితీయడానికి సమ్మర్ క్యాంప్‌లు ఉపయోగపడతాయని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 65వ వార్డు పరిధి కాకతీయ మైదానంలో సీనియర్ క్రికెట్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంపును ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం పెంపొందిస్తాయని చెప్పారు. రాణిస్తే మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో అసోషియేషన్ సభ్యులు కసిరెడ్డి నూకరాజు, రాజారావు, కార్పొరేటర్లు గంధం శ్రీనివాస్, బొడ్డు నరసింహపాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

ఎండకు విలవిల



భానుడు ఆదివారం ప్రతాపం చూపాడు. దీంతో దువ్వాడ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారంపై ఏర్పాటు చేసిన శుద్ధినీటి కేంద్రం వద్ద ప్రయాణికులు బారులు తీరారు. నాలుగు ట్యాప్‌లు ఏర్పాటు చేసినీటిని అందించినప్పటికీ రద్దీ తగ్గలేదు. మరోవైపు కేవలం రెండు నిమషాలే హాల్ట్ ఉండడంతో ప్రయాణికులు రైలు కదిలిపోతుందనే భయంతో నీటి కోసం వేచి ఉన్నారు. – అగనంపూడి

కులగణనతోనే బీసీలకు న్యాయం

సీతంపేట: కులగణనతోనే బీసీలకు అన్ని రంగాల్లో తగిన ప్రాధాన్యత లభిస్తుందని బీసీ సమన్వయ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు అంగడాల పూర్ణచంద్రరావు అన్నారు, ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆదివారం బీసీ సమన్వయ కమిటీ ఉత్తరాంధ్ర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కట్టా మల్లేశ్వరరావును బీసీ సమన్వయ కమిటీ విశాఖ జిల్లా అధ్యక్షునిగా నియమించి నియామక పత్రం అందజేసి సత్కరించారు.